క్లుప్తంగా

రేపు వైద్య శిబిరం

తాండూరు: మూత్రకోశ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సాయితరుణ్ ఆస్పత్రి నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతోందన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మూత్రకోశ, కిడ్నీ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్.గౌతం కృష్ణారెడ్డి వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాయితరుణ్ ఆసుపత్రి నిర్వాహకులు కోరారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్

పెద్దేముల్: పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జామా మజీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్ విందులు ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. శీబ్లి, మోజంఖాన్, షరీఫ్, ఆజంఖాన్, ముజీబ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాజ్యం రాబోతోంది

పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు

దౌల్తాబాద్: రాబోయేది కాంగ్రెస్ రాజ్యం రాబోతోందని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర శుక్రవారం తిమ్మాయిపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న, చెన్నారం నర్సింలు, రాములు, భీములు, కుర్మని దస్తప్ప, వెంకట్రాములు, రెడ్యానాయక్, మోహన్‌నాయక్, కృష్ణ, మహిపాల్ తదితరులున్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

బొంరాస్‌పేట: వరిపంట కోతలు మొదలైనందున ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు డబ్బులు రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సంబంధిత అధికారులకు వివరించి డబ్బులు త్వరలో అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు వివరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు నర్సింలుగౌడ్, మల్లేశ్, నర్సింలు నాయుడు, మల్లికార్జున్, సంతోశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్



ప్రార్థనా స్థలాన్ని పరిశీలిస్తున్న శంకర్‌సింగ్

తాండూరు టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలకు స్థలం సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ అన్నారు. శుక్రవారం చెన్‌గేష్‌పూర్ రోడ్డు మార్గంలోని ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానం లోపలికి వెళ్లి బయటకు వచ్చే మార్గాలను పరిశీలించారు. ప్రార్థనల సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య పరిరక్షణ వంటివి పూర్తి చేశామన్నారు. ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేశామని, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందరూ ప్రార్థనల సందర్భంగా ఈద్గా వద్ద ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఇప్పాయిపల్లిలో 'బలగం'

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో సర్పంచ్ అనురాధరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ ఆధ్వర్యంలో గురువారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. పిల్లలు, పెద్దలు పెద్ద ఎత్తున సినిమాను వీక్షించారు.

ఈత సరదా ప్రమాదం కావద్దు

ఎస్‌ఐ రమేశ్ కుమార్

దౌల్తాబాద్: వేసవికాలంలో విద్యార్థులకు సెలవులు రావడంతో పిల్లలు, యువకులు సేద తీరేందుకు, ఈత నేర్చుకునేందుకు వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశం ఉన్నందున చిన్నారుల తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని ఎస్‌ఐ రమేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఈత రానివారు ఒంటరిగా వెళ్లకూడదన్నారు. ఈత నేర్చుకునే వారు వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు.

పీహెచ్‌సీల్లో 'ఆరోగ్య మహిళ'

మహిళల సంపూర్ణ ఆరోగ్యసాధనకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆరోగ్య మహిళా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. జిల్లా పరిధిలో ఈ మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభించేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- ప్రతీ మంగళవారం ఉచిత వైద్య పరీక్షలు
- మూడు ఆరోగ్య కేంద్రాల్లో ప్రారంభం
- ఎనిమిది రకాల రుగ్మతలకు చికిత్సలు



ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వాన్ కుమార్

వికారాబాద్ అర్బన్: మహిళలు ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆరోగ్య మహిళ అనే పేరుతో గ్రామీణ, పట్టణ మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వ్యాధులను గుర్తించేందుకు ప్రతీ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినా.. జిల్లాలో ఈ నెల నుంచి ప్రారంభించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా పరిధిలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించారు. రామయ్యగూడ, దోమ, యాలాల్ పీహెచ్‌సీలో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఎనిమిది రకాల రుగ్మతలకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి వైద్య సాయం అందించేందుకు నిర్ణయించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వాన్ కుమార్ మాతా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి డాక్టర్ సాయిబాబ, డాక్టర్ ఆనంద్, డాక్టర్ సమతతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు.

ఆరోగ్య సమాచారం

పరీక్షల అనంతరం ఆరోగ్య మహిళ యాప్‌లో వివరాలను నమోదు చేయనున్నారు. ప్రతీ పేషెంట్‌కు తన ఆరోగ్య పరిస్థితి, వైద్యం వివరాలతో కూడిన కేస్ షీట్ ఇస్తారు. పరీక్షలు పూర్తయ్యాక మెరుగైన వైద్య సేవలు అవసరం అని భావిస్తే ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయనున్నారు. మెనోపాజ్ సంబంధించి పరీక్షలు చేసి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారు. లైంగిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేయనున్నారు. మహిళల్లో బరువు నియంత్రణకు అవసరమైన సూచనలు సలహాలు ఇస్తూ, కౌన్సెలింగ్ కూడా ఇవ్వనున్నారు. అవసరమైన వారికి మమ్మోగ్రామ్, అల్ట్రాసౌండ్, కాల్పోస్కోపీ, క్రయోథెరపీ, పాప్‌స్మియర్ పరీక్షలు చేయనున్నారు.

విస్తృత ప్రచారం

ప్రభుత్వం ఆదేశానుసారం ఆరోగ్య మహిళా కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసేందుకు వైద్యాధికారులు సిద్ధమయ్యారు. మహిళలకు ప్రతీ మంగళవారం అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తారనే విషయాన్ని స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా వివరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మహిళలు ప్రతీ మంగళవారం అందుబాటులో ఉన్న డయాగ్నోస్టిక్ కేంద్రానికి వెళ్లేలా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులు సూచిస్తున్నారు.

నిర్వహించే పరీక్షలు

మధుమేహం, రక్తపోటు, రక్త హీనత, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల స్క్రీనింగ్, సూక్ష్మపోషక లోపాల నిర్వాహణ, చికిత్స, పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్, సిండ్రోమ్, రుతు సమస్యలు, కుటుంబ నిర్వాహణ ప్రణాళిక, మెనోపాజ్, యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్స్, పెల్విక్ ఇన్‌ఫ్లామెంటరీ డిసీజ్, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు, బరువు పెరగడం వల్ల జరిగే అనార్థాలపై కౌన్సెలింగ్‌తో పాటు పరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉండాలనే..

ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. జిల్లా పరిధిలో ఈ మంగళవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. మూడు పీహెచ్‌సీలను ఎంపిక చేశాం. శుక్రవారం నిర్వహించిన సమావేశంలోమూడు పీహెచ్‌సీల వైద్యులు, స్టాఫ్ నర్సులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చాం.

– డాక్టర్ పాల్వాన్ కుమార్ , డీఎంహెచ్‌ఓ

26, 27న వాలీబాల్ టోర్నమెంట్

బంట్వారం: చేవేళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఈ నెల 26, 27 తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బంట్వారం సర్పంచ్ ఆలంపల్లి లావణ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండో బహుమతిగా రూ.15వేల నగదు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 25లోపు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 87900 56281, 63008 42176 నెంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

టీడీపీతోనే బడుగుల ఉన్నతి

పార్టీ మండల అధ్యక్షుడు మాసయ్యముదిరాజ్

కుల్కచర్ల: టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాల ఉన్నతి సాధ్యమని పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా నూతన సభ్యత్వ నమోదులు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామస్వామి, ఆంజనేయులు, కృష్ణ, రవి, రమేశ్, సాయి, అంజి, రాముస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మనోహర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న వీఓఏలు

డీసీసీబీ చైర్మన్‌కు విన్నవించిన వీఓఏలు

కుల్కచర్ల: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని వీఓఏలు డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన్ను తిర్మలాపూర్ గ్రామంలో కులకచర్ల, చౌడాపూర్ మండలాల వీఓఏలు కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో మహిళల అభ్యున్నతికి వీఓఏలు ఎంతోకృషిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మండల వీఓఏల సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, చౌడాపూర్ మండల సంఘ అధ్యక్షులు ఆజంపాషా, సంఘ నాయకులు నరేందర్, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు గ్రూపులుగా ఏర్పడండి

- శిక్షణ పూర్తి చేసుకున్న వారికే యూనిఫాంల కుట్టు బాధ్యత
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ధ్రువీకరణ పత్రాలు, కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో మూడు నెలలు ఉచిత శిక్షణ పొందిన వారు గ్రూపులుగా ఏర్పడాలని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది ఎస్సీ మహిళలకు ఆయన ధ్రువీకరణ పత్రాలు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో మొదటిసారిగా కొడంగల్‌లోనే ఎస్సీ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇప్పించి మిషన్లు ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాల విద్యార్థులకు ఇచ్చే యూనిఫాంలు కుట్టే బాధ్యతను వీళ్లకే అప్పగిస్తామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. దళిత బంధు పథకంలో భాగంగా నిరుద్యోగులకు ఒక్కొక్కరికి రూ.10లక్షల చొప్పున ఇచ్చి స్వయం ఉపాధి పథకాలతో జీవనోపాధి కల్పించామన్నారు. అనంతరం కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు మధుయాదవ్, వెంకట్‌రెడ్డి, బీఎమ్ రమేశ్, శంకర్, సాయి ప్రసన్న, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ అధికారు లు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

ఎంఈఓ హరిశ్చందర్

దోమ: మన ఊరు మన బడి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మనఊరు మనబడి పనుల్లో కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 24న ప్రతీ పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశాలు నిర్వహించి.. విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు ఇవ్వాలన్నారు. వచ్చే అకడామిక్ సంవత్సరానికి ఉపాధ్యాయులతో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి నర్సింహులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహేంద్రబహదూర్, హరిలాల్, శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది రెడ్యా, రఘు, వెంకటేశ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

మండల పరిధిలోని మోత్కూర్ ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తి శుక్రవారం ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ హరిశ్చందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు రవి, అశోక్, సతీశ్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల్లో మన ఊరు మన బడి పనులను శుక్రవారం గ్రామస్తులు పరిశీలించారు. సర్పంచ్ నాగర్జున, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, గ్రామస్తులు వీరేందర్‌రెడ్డిలు పాఠశాలకు వెళ్లి పలు సూచనలు చేశారు. ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు, పాఠశాల ఆవరణలో స్టేజీ నిర్మించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీను, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, ఎస్ఎంసీ చైర్మన్ సురేశ్, మాజీ వైస్ ఎంపీపీ మొగులప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

పెద్దేముల్: తట్టెపల్లి మండల సాధన కోసం మండల సాధన సమితి అధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారం 14వ రోజుకు చేరాయి. ప్రభుత్వం స్పందించి మండల కేంద్రం ప్రకటించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తట్టెపల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న తండాలు కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేకు గిరిజనులపై ప్రేమ ఉంటే సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి మండల కేంద్రం ప్రకటించేలా చూడాలని కోరారు. అడ్కిచెర్ల, ఓంలానాయక్‌తండా, పాషాపూర్, జైరాంతండా, రచ్చకట్టతండాల గిరిజనులు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ డైరక్టర్ ప్రభుకుమార్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు డీలర్ అంజప్ప, శంకర్, పండరి, రాజు, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో నినదిస్తున్న మండల సాధన సమితి సభ్యులు

పేదలకు అండగా ఉంటా



కుల్కచర్ల: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మహేశ్‌రెడ్డి



దోమ: ఆర్థికసాయం అందజేస్తున్న రాజేశ్వరమ్మ

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: నిరుపేదలకు, పార్టీ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోరిగడ్డతండాకు చెందిన వడిత్య నాగ్యా నాయక్, నీలిబాయి మృతిచెందారు. కాగా ఎమ్మెల్యే శుక్రవారం బాధితుల ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాం రెడ్డి, నాయకులు అంగూర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంతో పాటు చెంచు కాలనీలో నర్సమ్మ, బాజర్ల భీమయ్య అనారోగ్యాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి వైస్ ఎంపీపీ మల్లేశంతో బాధిత కుటుంబాలను పరామర్శించి, ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.5వేల చొప్పున రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సంపల్లి మల్లేశ్, మాజీ వార్డు సభ్యులు చిన్నయ్య, చంద్రయ్య, శ్రీను, రమేశ్, ఆంజనేయులు, శేఖర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. భీమయ్య కుటుంబ సభ్యులకు కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు కృష్ణ

అనంతగిరి: వికారాబాద్‌లో కురుమ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కురుమ సంఘం నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకుఆనంద్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నివాసం వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కృష్ణ, గోపాల్, ఎంపీడీఓ సత్తయ్య, శ్రీనివాస్, నర్సింలు తదితరులున్నారు.

జయంతి వేడుకలకు ఆహ్వానం

ఈనెల 23న నిర్వహించే బసవేశ్వర జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఎమ్మెల్యేకు వీరశైవ సమాజం ప్రతినిధులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు విజయ్‌కుమార్, కౌన్సిలర్ కిరణ్‌పటేల్, ఆత్మలింగం, వీరన్న, డాక్టర్ భక్తవత్సలం, బస్వరాజు, గిరీశ్ కొఠారి, రవిశంకర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఈనెల 25న వికారాబాద్‌లోని తేజ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ప్లీనరీ ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పరిశీలించారు. ఆయన వెంట రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి,డ్యెంసీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పలువురు కౌన్సిలర్లున్నారు.

ముస్లింల అభ్యున్నతికి సీఎం ప్రాధాన్యం



తాండూరుటౌన్: రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న దీప



తాండూరు రూరల్: కోటబాసుపల్లిలో పంపిణీ చేస్తున్న సర్పంచ్

వైస్ చైర్‌పర్సన్ దీప

తాండూరు టౌన్: ముస్లింల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని తాండూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. శుక్రవారం 9వ వార్డులోని ముస్లిం మహిళలకు ఆమె రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దీప మాట్లాడుతూ.. పేదింటి ఆడిపిల్ల వివాహానికి షాదీముబారక్ పథకం ద్వారా నగదు అందజేస్తున్నారని వివరించారు. మైనార్టీ కార్పొరేషన్ నిధులు, విద్యార్థులకు మైనార్టీ గురుకుల పాఠశాలల ఏర్పాటు, ఓవర్సీస్ చదువులకు ఆర్థికసాయం, ప్రార్థనామందిరాల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోటబాసుపల్లి గ్రామంలో శుక్రవారం ముస్లింలకు సర్పంచ్ నాగర్జున రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు వీరేందర్‌రెడ్డి, మొగులప్ప, రాంశెట్టి, పంచాయతీ కార్యదర్శి లాలప్ప పాల్గొన్నారు.